నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జనవరి 05, 2025 | www.navatelangana.com

సీఅండ్ఎండీని కలిసిన ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాజేష్, వైస్ ప్రెసిడెంట్ డేగల ప్రవీణ్ కుమార్ శనివారం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లు, 2024, 25 ఆర్ఓఆర్ ప్రమోషన్ లిస్ట్ రిలీజ్ చేయడం వల్ల కార్మికులు న్యాయం జరుగుతుందని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఅండ్ఎండి సానుకూల స్పందించినట్లు పేర్కొన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం వహించిన శిక్షణ ఆఫీసర్ సస్పెన్షన్

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ పులుల అభయారణ్యంలోని జన్నారం రేంజ్ చింతగూడ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మధుకర్‌ను కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగంపై మధుకర్‌ను సస్పెండ్ చేసినట్లు ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.సుష్మారావు పేర్కొన్నారు. జన్నారం ఫారెస్ట్ రేంజ్ పైడిపల్లి అటవీ బీట్‌లో ఈ మధ్య కాలంలో కలప అక్రమ రవాణా ఎక్కువగా జరిగిందని, కలప స్మగ్లర్లతో కుమ్మక్కయ్యాడని, విధుల్లో నిర్లక్ష్యం వహించారనే పలు ఆరోపణ నేపథ్యంలో మధుకర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

స్థానికంపై నజర్..!

- ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న అధికార పార్టీ
- ఈ నెల 6న జిల్లాకు కాంగ్రెస్ అగ్రనేతల రాక
- ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశం
- బీఆర్ఎస్, బీజేపీలు సైతం ఎన్నికలపై ప్రధాన దృష్టి

ఈ ఏడాదిలో స్థానిక సమరం జరగబోతోంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం సంసిద్ధమవుతోంది. మరికొన్ని రోజుల్లోనే సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతుందనే ఊహాగానాల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందస్తుగా సన్నద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతో పాటు మున్సిపాలిటీలను అధిక మొత్తంలో కైవసం చేసుకొని తిరుగులేని శక్తిగా ఎదగాలని భావిస్తోంది. దీంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఆదిలాబాద్ పార్లమెంటు స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర ఇంఛార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపదాస్‌మున్షి, ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఇంఛార్జి మంత్రి సీతక్క వంటి అగ్రనేతలు హాజరుకానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పూర్తయింది. ఇది వరకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరిగినా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తున్నాయి. మరోపక్క పంచాయతీల్లో పాలకవర్గాలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసిపోయింది. మున్సిపాలిటీలో కౌన్సిలర్ల పదవీ కాలం సైతం త్వరలోనే ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల సంఘం సైతం వివిధ కార్యకలాపాలు పూర్తిచేసింది. ఈ క్రమంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఎన్నికలకు ముందస్తుగానే పార్టీని మరింత పటిష్టం చేయాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను నాలుగు ఎమ్మెల్యే స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఇందులో పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా.. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో మాత్రం ఖానాపూర్ ఎమ్మెల్యే ఒక్కరే ఉన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. దీంతో ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పార్టీని పటిష్టం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పార్లమెంటు పరిధిలోని పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నాయకులతో పాటు బ్లాక్ కాంగ్రెస్ తదితర నాయకులందరితో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సత్తాచాటాలని ఆ పార్టీ భావిస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి వారిలో జోష్ నింపాలని భావిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి అగ్రనేతలు జిల్లాకు రానుండటంతో ఆ పార్టీ కార్యకర్తల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది.

ఎన్నికలపైనే ఆ పార్టీల చూపు..!

స్థానిక సంస్థల ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకేసి పార్టీ క్యాడర్‌ను పటిష్టం చేసే పనిలో నిమగ్నం కాగా.. బీఆర్ఎస్ సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను పోటీ చేయించి వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలుపొందాలని భావిస్తోంది. తద్వారా జిల్లాలో తిరిగి పట్టుసాధించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇక ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో నాలుగు ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎంపీ స్థానంలో గెలుపొందిన బీజేపీ సైతం స్థానిక సంస్థలపై దృష్టిసారిస్తోంది. ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి ఎక్కువ స్థానాల్లో విజయం సాధించాలని భావిస్తోంది. ఈ తరుణంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన పార్టీల మధ్య రసవత్తర పోరుగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గుండెపోటుతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేష్ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జైనథ్ మాజీ ఎంపీపీ రోకండ్ల రమేష్(65) గుండెపోటుతో మృతి చెందాడు. జైనథ్ మండలం మాండగడ గ్రామానికి చెందిన రమేష్ చాలా ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. శనివారం ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనను మాజీ మంత్రి జోగురామన్న పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఇంతలోనే ఆయన చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన అంత్యక్రియలను ఆదివారం ఉదయం పట్టణంలోని జీఎస్ ఎస్టేట్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఆయన మృతి చెందడంతో పార్టీ నాయకులు, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోకండ్ల రమేష్ సింగిల్ విండో చైర్మన్ గా, ఎంపీపీగా సేవలందించారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేవారని తెలిపారు. మృదు స్వభావిగా, మంచికి మారుపేరుగా నిలిచిన ఆయన మృతి బాధాకరమన్నారు.







రోకండ్ల రాజకీయ ప్రస్థానం

1989లో జైనథ్ మండలంలో మొట్టమొదటి సారి టీడీపీ నుండి ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారు. 2022లో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి జోగు రామన్న ప్రోత్సాహంతో జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. టీడీపీ ప్రభుత్వంలో జైనథ్ మండల నాయకుడిగా జోగు రామన్నతో కలిసి రమేష్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు.

రమేష్ మృతికి సీపీఐ(ఎం) సంతాపం

మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేష్ మృతికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రమేష్ మృతి ప్రజాఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు.

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన 'కంది'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. అనంతరం కాసేపు నియోజకవర్గ రాజకీయాలు, పరిస్థితులపై చర్చించారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో సోమవారం జరగనున్న పార్లమెంటరీ సమీక్ష సమావేశం, త్వరలో రానున్న ఎన్నికలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలు అనుసరించాల్సిన కార్యాచరణ గురించి కందికి టీపీసీసీ చీఫ్ దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



ఉట్నూర్ : ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ కుష్బూగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఆశ్రమ పాఠశాల(బాలికలు)ను పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్య భోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి సిలబస్ త్వరగా పూర్తి చేసే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మొవా లడ్డు, డైట్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత అరికట్టేలా విటమిన్ సి గల టాబ్లెట్‌లను అందించాలని కోరారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఔషధాల రిజిస్టార్ పరిశీలించి ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు.

ఇప్పటికీ కొనసాగుతున్న కుల వివక్ష



జైపూర్: చెన్నూర్ ఏరియాలో కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చెన్నూర్ పట్టణంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలవుతున్నా దళితుల అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, వైద్యం అందక దళితులు అభివృద్ధికి దూరంగా బతుకులీడుస్తున్నారని పేర్కొన్నారు. రోజురోజుకు దళితులు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. కనీస రక్షణ లేకుండా చెన్నూర్ ఏరియా దళితులు చిన్న చూపుకు గురవుతున్నారని పేర్కొన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ లేకుండా పోతోందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 100 దురంహాకార హత్యలు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం చెన్నూర్ ఏరియా కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షులుగా జుమిడి కుమార్, కార్యదర్శిగా తాండ్ర అనిల్, ఉపాధ్యక్షులుగా దాసరి చందు, సుందిళ్ల రాజేశ్వరి, గాజుల ప్రవీణ, సహయ కార్యదర్శిగా తాండ్ర తలిక్, సభ్యులుగా తగరం నరేష్, కృష్ణమాచారి, మనుమల్ల శశికుమార్ ఎన్నికయ్యారు.

సబ్ పోస్ట్ ఆఫీస్ మంజూరు చేయాలి



బేల : మండల కేంద్రంలో సబ్ పోస్ట్ ఆఫీస్ మంజూరు చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోరే విశాల్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కోట్నాక రఘునాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేలలో సబ్ పోస్ట్ ఆఫీస్ లేకపోవడంతో ఆర్డీ ఖాతాలు, డిపాజిట్లు, విత్‌డ్రాలకు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందన్నారు. సీపీఐ పత్తి, సోయా చెల్లింపుల కోసం అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సేవల కోసం 30 కిలో మీటర్ల దూరంలోని జైనథ్ మండలం గిమ్మ సబ్ పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉపాధి కూలీల నగదు, పింఛన్ నగదు చెల్లింపులు తదితర పోస్టల్ సేవలు సకాలంలో అందకపోగా తీవ్ర ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా బేలలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం బేల అధ్యక్షులు ఉప్పల్‌వార్ కార్తీక్, కార్యదర్శి అమ్రేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి



జైపూర్: సింగరేణి అధికారులు నిధులు దుర్వినియోగం చేస్తున్నారని రామారావుపేట్, ఇందారం మాజీ ఎంపీటీసీ పెద్దల బాపు, అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ ఆరోపించారు. ఈ విషయమై శనివారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణను కలిసి ఫిర్యాదు చేశారు. ఇందారం ఓపెన్‌కాస్ట్ గని ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. సింగరేణి అధికారులు సంస్థ కంటే వ్యక్తుల ప్రయోజనాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు. రామారావుపేట్ శివారులో రూ.95లక్షలతో నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు సింగరేణి అవసరాల కంటే ఇతరుల అవసరాలకే ఉపయోగపడుతుందని తెలిపారు. సింగరేణి ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం పిలిచిన టెండర్లను రద్దు చేయాలని కోరారు. వ్యక్తుల ప్రయోజనాలు పక్కన పెట్టి సంస్థ అభివృద్ధిని కాంక్షించి గ్రామాల సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించాలని కోరారు.

6న జిల్లా యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

నస్పూర్ : జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 6న ఉదయం 4గంటలకు మంచిర్యాల ఆర్టీసి బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6, 7 తేదీలలో సికింద్రాబాద్‌లోని బోర్డ్స్ క్లబ్స్, ట్యాంక్ బండ్, యువజన సర్వీసుల ప్రధాన కార్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ, బోనఫైడ్, ఎస్ఎస్‌సి మెమో జిరాక్స్ ప్రతులతో సకాలంలో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9963539234 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్రాంతి తర్వాత రైతు భరోసా

- నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

రైతు భరోసా నిధులు సంక్రాంతి పండుగ తర్వాత విడుదల కానున్నాయని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం చెన్నూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 34 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్, 50 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా నిధుల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. పంటలు పండిస్తున్న రైతులు మాత్రమే లబ్ధి పొందనున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన అన్ని గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. రూ.10లక్షలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆరోగ్య సేవలు పొందవచ్చన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని, బావురావుపేట్‌లో రూ.కోటి4లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం విఫలమైందని రూ.100 కోట్లతో చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాల్టీల పరిధిలో అమృత్ పథకం పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో దాదాపుగా 80 శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అవసరమని, భర్తీ కోసం మంత్రి దామోదర రాజనర్సింహను కోరినట్లు తెలిపారు. మారుమూల నియోజకవర్గమైన చెన్నూర్‌కు అత్యధికంగా నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో గత పాలకులు భూదందా, ఇసుక దందా కొనసాగించారని ఆరోపించారు. గతంలో కొనసాగిన అక్రమ దందాలు బంద్ చేయించామని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా తనను బద్నామ్ చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

వాహనాలు నడిపే వారికి కంటి చూపు కీలకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి కంటి చూపు ఎంతో అవసరమని డీటీసీ వి.రవీందర్‌కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం దుర్గం ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్టీఓ కార్యాలయంలో నిర్వహించిన పరీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ స్కూల్ పిల్లలను తీసుకెళ్లే డ్రైవర్లకు కంటి చూపు ఎంతో అవసరమన్నారు. చూపు మందగించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సక్రమంగా కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేసేందుకు దుర్గం ట్రస్ట్ ముందుగా రావడం అభినందనీయమన్నారు. ప్రమాద రహిత వాహనాలు నడపడంతో పాటు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐ హరిందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల అవగాహన

గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ చౌరస్తాలో వాహనదారులకు పువ్వులు, చాకెట్లు అందిస్తు నియమాలు పాటించాలని కోరారు. హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడింగ్ చెయొద్దని కోరారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పువ్వులు, చాకెట్లు ఇస్తు నియమాలను పాటించాలని కోరారన్నారు. వాహనదారులు కూడా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌతం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వసంత్, వైస్ ప్రిన్సిపాల్, పీఈటీలు గోవింద్, నగేష్ ఉపాధ్యాయులు సవిత, రాధిక, లక్ష్మి కృష్ణవేణి పాల్గొన్నారు.

వైకల్యాన్ని అధిగమించి విజయం సాధించాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

ఎందరో అంధ దివ్యాంగులు తమ వైకల్యాన్ని అధిగమించి తాము ఎంచున్న రంగాలలో విజయం సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్‌తో కలిసి హాజరై అంధ దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యం ఉందని నిరాశ పడకుండా వైకల్యాన్ని ఎదురించి ఉన్నత స్థాయిలో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. లూయి బ్రెయిలీ అంధులకు అందించిన సేవలు చిరస్మరణీయమని, లూయి బ్రెయిలీ అందించిన బ్రెయిలీ లిపి ద్వారా ఎంతో మంది అంధులు ఉన్నత స్థానాలలో నిలిచారని అన్నారు. వైకల్యం అనేది శరీరానికి మాత్రమేనని మనసుకు, ఆలోచనకు కాదని, పిల్లలందరూ కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని అధిగమించి మరింత మందికి స్ఫూర్తిగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఫర్జానా బేగం, డిసిపిఓ ఆనంద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జనవరి 05, 2025 | www.navatelangana.com

శనగ పంట పరిశీలన

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి గ్రామంలో చవాన్ సుధాకర్, ఉప్పర్‌వార్ నితిన్‌ల శనగ పంటను మండల వ్యవసాయ అధికారి సాయితేజ, ఏఈఓ వినయ్ కుమార్ పరిశీలించారు. శనగ పంటను ఎండు తెగులు ఆశించిదని, ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు వడలిపోయి పసుపు రంగులోకి మారి



రాలిపోతాయని అన్నారు. ఈ తెగులు వచ్చిన మొక్కలు అక్కడక్కడ గుంపులు గుంపులుగా చనిపోతాయని తెలిపారు. దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ అనే మందును 3గ్రాములు (లేదా) ట్రైకోడర్మా విరిడేను 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ళలో డ్రెంచింగ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఆకాశ్, నితిన్, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కారు బైక్‌ను ఢీ కొనగా వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం సోన్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన గంగన్న(52) తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. జాఫ్రాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఓ కారు ఢీ కొనడంతో గంగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



రేపటి చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వ్యవసాయ కూలీలకు కూలిబంధు అమలు చేయాలని, విధి విధానాలు ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే చలో కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, వ్యవసాయ కూలీలకు కూలీబంధు సహాయం అమలు చేయాలని, విధి విధానాలు ప్రకటించాలని అన్నారు. గ్రామ సభలో అర్హులైన కూలీలను ఎంపిక చేయాలనీ, పారదర్శకంగా అందరికి అందేలా చూడాలని డిమాండ్ చేస్తూ, సోమవారం జరిగే ధర్నాను కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు నెళ్ల స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆటోల ర్యాలీని చేపట్టారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులు గుండా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 30వ తేది వరకు సడక్ సురక్ష అభియాన్ పర్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రమాదాలు, రోడ్డు నియమాల అవగాహన కల్పిస్తామన్నారు. చిన్న చిన్న అంశాలను గుర్తించినప్పుడే ప్రమాదాలను నివారించుకోగలమన్నారు. పట్టణంలోని బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి అక్కడ నెంబర్ ప్లేట్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు తదితర వాటిని గురించి నిర్ణయిస్తామన్నారు. అదే విధంగా నియమాలపై ప్రతి పాఠశాలలో పోటీలతో పాటు వర్క్ షాప్‌ను నిర్వహిస్తామన్నారు. ప్రమాదాల నివారణను ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ పి.రవీందర్ కుమార్, ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్, డీఎం కల్పన, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐలు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

అంధుల జీవితాల్లో లూయి బ్రెయిలీ వెలుగులు నింపారని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఫసిఉద్దీన్ అన్నారు. శనివారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ తన జీవితాన్ని అంధుల అభ్యున్నతికి అంకితం చేసి, వారికి విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారని, ఆయన జయంతి వేడుకలను జరపడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా గౌరవాధ్యక్షుడు తొడసం శంభు, గంగారాం, దివ్యాంగులు పాల్గొన్నారు.

పులి దాడిలో పశువులు మృతి?

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని గొల్లఘట్ తాంసి(కె) పిప్పల్‌కోటి పరిసర ప్రాంతాలలో గత కొన్ని సంవత్సరాలుగా పులులు సంచరిస్తు చుట్టుపక్కల గ్రామాల రైతులకు కంటిమీద కునుకు లేకుండా భయాందోళనకు గురిచేస్తూ, అటవీ అధికారులకు కనబడకుండా సంచరిస్తున్నాయి. శుక్రవారం రోజు రాత్రి పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన నజీర్ అయూబ్‌కు చెందిన మూడు పశువులపై పులి దాడి చేసి చంపినట్లు అనుమానిస్తున్నారు. శనివారం అటవీశాఖ అధికారులు పశువులు మరణించిన సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను, పశువులను పరిశీలించారు. పులిదాడి చేసినట్లు ఎటువంటి ఆనవాళ్లు కనబడకపోవడంతో పశువులు మరణించిన ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సీసీ పుటేజీలను పున : పరిశీలిస్తామని అన్నారు.

సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. మార్కెట్ యార్డులో సివిల్ సప్లయ్ గోదం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకోగా, కండ్లకు గంతలు కట్టి వినూత్న రీతీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ కార్మికులకు పెంచిన రెట్ల జీఓను అమలు చేయాలన్నారు. ఒప్పందాలు చేసుకొని వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలతో పాటు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మెను. కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, హామాలీ యూనియన్ నాయకులు సలీం, మోసిన్, రాజేందర్, రమేష్, పొచ్చన్న పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షలో సత్తాచాటిన అమాన్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షలో మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల



విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షకు రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుంచి 9వ తరగతి నుంచి అమాన్, 8వ తరగతి నుంచి పోటీలో పాల్గొన్నారు. వీరిలో రాజుర పాఠశాల విద్యార్థి అమాన్ మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తచాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు గ్రామస్తులు శనివారం గైడ్ టీచర్ విజయ్ కుమార్‌ను, విద్యార్థి అమాన్‌ను అభినందించారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

- ఎస్పీ గౌస్‌ఆలం

నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రతి ఒక్కరూ గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. శనివారం మండలంలోని సిరిచెల్మ గ్రామంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి, శీతాకాల దృష్ట్యా 2000 దుప్పట్లను పంపిణీ చేశారు. మొదటగా గ్రామ ప్రజలు సాంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ జిల్లా ఎస్పీకి, ఉట్నూర్ ఏఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు పూలమాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. పోలీసు కళజాత బృందంచే గంజాయి వల్ల కలిగే అనార్థాలు, యువతపై ప్రభావాలు, రోడ్డు ప్రమాదాల గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ బారిన మోసపోకుండా జాగ్రత్త, తదితర అంశాలపై పాటల రూపంలో కళలను ప్రదర్శిస్తూ, ప్రజలకు అర్థమయ్యే విధంగా గోండి భాషలో తెలియజేశారు.



ఈ మెగా మెడికల్ క్యాంపు, దుప్పట్ల పంపిణీకి ఇచ్చోడ, సిరికొండ మండలాలకు చెందిన 12 గ్రామాల ప్రజలు పాల్గొని, హైదరాబాద్ రోటరీ క్లబ్ సహకారంతో దాదాపు 2000 బ్లాంకెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా రిమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న 15 మంది వైద్యుల బృందం పాల్గొని చికిత్సలు అందజేశారు. అందులో ముఖ్యంగా గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, ఇఎన్టీ, పీడియాట్రిషన్ లాంటి వైద్య సేవలను అందించారు. దాదాపు 600 మంది ఆదివాసులు పాల్గొని, మెడికల్ క్యాంపును విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఉట్నూరు ఎఎస్పీ కాజల్, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబుల్లా, ఇచ్చోడ సీఐ భీమేష్, ఇచ్చోడ ఎస్సై ఎ.తిరుపతి, ఎస్సైలు శ్రీకాంత్, మహేందర్, రోటరీ క్లబ్ సభ్యులు అనిత, చైత్ర, ఫణిందర్, ఇచ్చోడ, సిరికొండ గ్రామ ప్రజలు వైద్య బృందం పాల్గొన్నారు.

టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీకి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని టోల్ ప్లాజాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కామారెడ్డిలోని ఎన్‌హెచ్‌ఏఐ ప్రైమరీ ఇంప్లీమెంటేషన్ యూనిట్‌లో పీడీ శ్రీనివాసరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. నేషనల్ మానిటైజేషన్‌లో భాగంగా జాతీయ రహదారుల కేంద్ర ప్రభుత్వం నూతనంగా టోల్ ఆపరేటింగ్ ట్రాన్స్‌ఫర్ టీఓటీ అనే విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. దీనివలన కంపెనీల గుత్యాధిపత్యం పెరిగి కార్మికులను ఇబ్బందులకు గురి చేసే పరిస్థితులు కల్పించిందన్నారు. టీఓటీ అమలు చేసే ముందు టోల్ ప్లాజాలలో పనిచేస్తున్న కార్మికులందరినీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా గుర్తించాలని, వారందరికీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కార్మికులందరినీ యధావిధిగా కొనసాగించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.50లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, నేరడిగొండ రోల్‌మామడ టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు నక్క లక్ష్మణ్, పిప్పర్‌వాడ టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు ఏ.సంతోష్, గంజాల్ టోల్ ప్లాజా అధ్యక్షులు రమేష్, నాయకులు ప్రశాంత్, ఎస్‌కె అహ్మద్, పురుషోత్తం, భీమేష్, రమేష్ పాల్గొన్నారు.

పుస్తకాల ద్వారా వచ్చిన జ్ఞానం ఉండిపోతుంది..

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్నెట్, కంప్యూటర్ ద్వారా వచ్చిన జ్ఞానం పోతుందని, కానీ పుస్తకాల ద్వారా వచ్చిన అదే జ్ఞానం నిత్యం ఉండిపోతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో వివేక జాగృతి బుక్ ఎగ్జిబిషన్ అండ్ సెల్‌ను నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం పుస్తక ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు పాఠశాల యాజమన్యాన్ని సమితి సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వచ్చిన జ్ఞానం ఎన్నటికి పోదన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలం కూడా పుస్తకాల ద్వారానే వచ్చినవేనని తెలిపారు. స్వామి వివేకానంద అమెరిక వెళ్లినప్పుడు ఆయన ప్రసంగంలో సోదరసోదరీమణుల అంటూ మొదలు పెట్టారన్నారు. ఆ జ్ఞానం కూడా పుస్తకం ద్వారా



వచ్చిందని ఆయన చెప్పారన్నారు. ఒక మంచి పుస్తకం మంచి మిత్రుడితో సమానమన్నారు. జ్ఞానాన్ని పెంచే పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. దాని ద్వారా మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకుంటూ స్ఫూర్తి పొందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్, సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, లెనిన్, పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్, బీజేపీ నాయకులు మయూర్ చంద్ర, సమితి సభ్యులు లస్మయ్య, కోటేశ్వరరావు, లంక హనుమండ్లు పాల్గొన్నారు.

కోతుల మాస్క్‌తో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మూడు కోతుల ముఖచిత్రాలను ధరించి మౌనంగా ఉంటూ చెడు చూడకు, చెడు వినకూ, చెడు మాట్లాడకు అనే వినూత్న రీతిలో ప్రభుత్వానికి అర్థమయ్యే విధంగా నిరసన ప్రదర్శన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్నటి సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై స్పందించి మీకు రెగ్యులరైజ్ చేయడం ఇప్పట్లో చేయమని, ఇట్టి విషయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, మీ ఉద్యోగులందరూ రాజకీయాలకు, ఉపాధ్యాయ సంఘాలకు వత్తాసు పలికినట్టు మాకు సమాచారం ఉంది అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. కానీ రాజకీయ నాయకులకు, ఉపాధ్యాయ సంఘాలకు వత్తాసు కాదని తెలుపుతూ నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీరికి సంఘీభావం తెలుపడానికి కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్.సుహాసిని సమగ్ర శిక్ష ఉద్యోగులకు అండగా ఉంటామని, మీ అందరికి ఎంటీఏ, బేసిక్ పే తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ సభ్యులు గంగాధర్, రాము, ఫిరోజ్, తిరుపతి, నాగలక్ష్మి, రాజారత్నం, అనసూయ, సల్మాన్ నాయక్, నవత, సాయినాథ్, రజిత, సునిత, అపర్ణ, గీతరాణి, పుష్ప లత, లక్ష్మి, రవి, ఆనంద్, సమస్త నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, విద్యా శాఖలో విలీనం చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ అన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తనకు ఉందని, కానీ తాను ఏమిచేయలేని స్థితిలో ఉన్నానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకోగా, పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడి ప్రజా భవన్ ఎదుట కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ సమ్మె శిబిరం నుంచి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజా సేవా భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ బైఠాయించి, నినాదాలు చేశారు. కంది శ్రీనివాస్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ ఫోన్ ద్వారా సమగ్ర ఉద్యోగులతో మాట్లాడించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ టీపీసీసీ హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి తమను చాయ్ తాగేలోపు రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ సంవత్సరం గడుస్తున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. రెగ్యులర్ చేసేలోపు క్యాబినెట్‌లో పే స్కెల్ పెంచుతూ నిర్ణయం తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరంసింగ్, కోశాధికారి కేశవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

లిఫ్ట్ ఇరిగేషన్ లీకేజీలతో అన్నదాతకు కష్టాలు

- ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రైతుల వినతి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలోని శ్రీరాజ రాజేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పది సంవత్సరాల నుంచి రైతులకు రెండు పంటలకు సరిపడా పుష్కలంగా నీరు అందేది. దీంతో రైతులు పంటలు బాగా పండించి ఆనందంగా జీవనాన్ని గడిపారు. కానీ గత మూడు సంవత్సరాల నుంచి ప్రధాన పైప్‌లైన్ లీకేజీలతో సమస్యలు తలెత్తడం, దీనికి తోడుగా మోటార్లు మరమ్మతులకు గురికావడంతో రైతులు, లిఫ్టు ఇరిగేషన్ కమిటీ ఆధ్వర్యంలో వాటి మరమ్మతులకు ఖర్చులు చేశారు. ఈ సంవత్సరం ప్రధాన పైప్‌లైన్‌కు గండి పడింది. అలాగే మోటార్లు రిపేర్లు కావడం వాటి మరమ్మతులకు పెద్ద మొత్తం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఈ యాసంగికి దాదాపు 700 నుంచి 800 ఎకరాలకు సాగు నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రధాన పైప్ లైన్ లీకేజి సమస్య, మోటార్ల మరమ్మతుల సమస్యను పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలకు యువత ఆకర్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదకద్రవ్యాలకు అత్యధికంగా యువత ఆకర్షితులవుతున్నారని మహిళ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థి కళాశాలలో మదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రయోజనలపై అవగాహన కల్పించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం యాంటి డ్రగ్ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహిళ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల్లో తెలియని అనుభూతి ఉంటుందని, దానికి యువత ఆకర్షితులవుతారన్నారు. దాని కారణంగా వారు శరీరకంగా, మానసికంగా చాలా ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. యువత బాడీ అన్నింటిని తట్టుకుంటుందని, డ్రగ్స్‌కు తట్టుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. అయితే ఇలానే అలవాటు అయితే జీవితం నాశనం అవుతుందన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. చెడు వ్యాసనలకు పోకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే డీవైఓ సుశీల్ బడ్, డవ్ ఎన్జీఓ ప్రతినిధి అశోక్, రవీందర్, పురుషోత్తంరెడ్డి, శిరీష్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్

నార్నూర్ చిన్నారులకు సకాలంలో క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ సూచించారు. శనివారం మండలంలోని మాన్యాపూర్ గ్రామ పంచాయతీలోని రాజులగూడ గ్రామంలోని గర్భిణులు, చిన్నపిల్లలకు టీకాలు వేశారు. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారి వెంట ఏఎస్ఎం శిలా, అంగన్‌వాడీ టీచర్ కరిజా, ఆశాకార్యకర్త ఆడే నిర్మలబాయి ఉన్నారు.

శ్రీగండి రామన్న ఆలయాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శ్రీగండి రామన్న దత్త సాయిబాబా ఆలయ చైర్మెన్ గంగోని భరాజ్ శనివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనకిచ్చిన అవకశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చిన్ను ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన రాజారెడ్డి తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, రమణరెడ్డి, ధర్మాజీగారి రాజేందర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్‌రూరల్ మండలంలోని తాంశ గ్రామానికి చెందిన బరుకుంట గంగాధర్ సీఎం సహాయనిధికి కింద మంజూరైన రూ.56వేల చెక్కును లబ్ధిదారునికి శనివారం నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జమాల్, జుట్టు దినేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అధికారులను కలిసిన ఆప్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్, పార్టీ సభ్యులు శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారికి పూల బొకేలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకొస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు సాయి, మహమ్మద్ సాధిక్, జహెద్, ఇలియాస్, జహీర్, హైమద్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం నిధులు మంజూరు చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. కరంజివాడ గ్రామానికి చెందిన పలువురు ఏడాది క్రితం తమ కూతుళ్ళకు వివాహాలు జరిపించారని తెలిపారు. ఏడాది గడుస్తున్న నేటికీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందలేదని అందలేదన్నారు. పలువురికి పింఛన్ మంజూరు కాలేదని ఆరోపించారు. దీంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు, పింఛన్ దారులకు పింఛన్ అందజేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వైద్య సేవలు నిమిత్తం మంజూరు చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును వాంకిడి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోవలక్ష్మి అందజేశారు. వాంకిడి మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన నాగోసే మనోహర్‌కు రూ. 42000, వడే చిన్నుబాయికు రూ.20000 వేల చెక్కును లబ్ధిదారులకు అందించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజలకు తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నిసార్, వైరాగడే రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ బాల్య విద్యకు అంగన్‌వాడీల తోడ్పాటు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ గ్రామంలో రైతు వేదిక వద్ద గల అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులు తమ వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు చేసుకుని సమయానుసారంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన మందులు, పౌష్టిక ఆహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఈఈ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సీడీపీఓ సాదియ, ఎపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోతురాజు ధర్మరాజు మహోత్సవ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని జోడేఘాట్ కమాన్ వద్ద పోతురాజు ధర్మరాజు మహోత్సవానికి సభంధించిన వాల్‌పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ మహోత్సవం ఈనెల 15 నుంచి 17 వరకు ఇందపూర్ సమీపంలోని పోతురాజు ఆలయంలో కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు సిడాం ధర్ము మాట్లాడుతూ రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించాలన్నారు. మొదటి బహుమతి రూ.7777, ద్వితీయ బాహుమతి రూ.5555, తృతీయ బహుమతి రూ.3333 అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, భీంరావు, సెడ్మాకి తుకారం, రాజు, మారుతీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందజేసిన జీఎం

నవతెలంగాణ-రెబ్బెన

బాదిత కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అందించారు. ఖైర్‌గూడ ఓసీలో విధులు నిర్వహిస్తు జీవీ సత్యనారాయణ ఇటీవల మరణించాడు. బాదిత కుటుంబ సభ్యులకు రూ.7.50 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ అమౌంట్‌ని ఎఫ్‌డీ రూపంలో అతని భార్య అనంత లక్ష్మికి జీఎం కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ తిరుపతి, ఎస్ఓటూజీఎం కే.రాజమలు, ఖైర్‌గూడ ఓసీ పీఓ నరెందేర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవి, డిప్యూటీపీఎం ఎస్. వేణు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అమరుల ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్‌పాషా, నాయకులు లాల్‌కుమార్ అన్నారు. న్యూ డెమోక్రసీ నాయకులు బావండ్లపల్లి కనకయ్య 30వ వర్ధంతి సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణం ఎన్టీఆర్ చౌరస్తాలోని స్థూపం వద్ద నివాళు లు అర్పించి జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకయ్య విప్లవ కృషిని కొనసాగిస్తామని అన్నారు. మతతత్వాన్ని విప్లవ ప్రజాపోరాటంలో ఓడిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ రత్నం హోసన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు టి శ్రీనివాస్, జిల్లా నాయకులు బండారు తిరుపతి, ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఉపాధ్యక్షులు లెనిన్, కనకయ్య కుటుంబసభ్యులు రాధ, వేణు, రవి, కృష్ణ, శ్యాం పాల్గొన్నారు.

రేపు మండలానికి ఎమ్మెల్సీ కవిత రాక

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల 6న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాంకిడి మండలకేంద్రానికి రానున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ తెలిపారు. అలాగే మండలంలోని దాగా గ్రామానికి చెందిన విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకకర్తలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాశ్వత కార్యదర్శిని నియమించరా..?

- ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు
- ఇన్‌చార్జి కార్యదర్శులతోనే నెట్టుకోస్తూ..
- కార్యదర్శి పట్టింపులేనితనం
- సిబ్బంది ఇష్టారాజ్యం
- గోలేటిలో కుంటుపడిన పంచాయతీ పాలన



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో పంచాయతీ పాలన కుంటుపడింది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ఇప్పుడు గ్రామపంచాయతీలకు సర్పంచులు లేరు. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. గోలేటి గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శి ఉన్న గ్రామపంచాయతీ పరిధిలోని పలు కాలనీలో కనీస సౌకర్యాలైన తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలపై కొంతకాలంగా వాటి నిర్వహణ పట్ల పట్టించుకున్న అధికారులు లేరని స్థానిక ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన నిర్వహణను ప్రత్యేక అధికారితో పాటు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలి. మంచినీటి సరఫరాలో జాప్యం వల్ల ట్యాంకుల క్లోరినేషన్ పరిశుభ్రత లేకుండా క్రిమి కీటకాలు ఉండే నీటిని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై సిబ్బందితో చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. నీటి సరఫరాలో వేలాపాల లేని సమయాల్లో నీటిని సరఫరా చేస్తు ప్రజలను ఇబ్బంది గురి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వాలు మిషన్ భగీరథ పైపులైన్ వేసిన ఆ పైపుల ద్వారా చుక్క నీరు రావడంలేదని భగత్ సింగ్ నగర్, గౌతమ్ నగర్, దుబ్బగూడా కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీవాసులకు సమయానుకూలంగా నీటిని సరఫరా చేస్తున్నామని రికార్డులో రాసిన గ్రౌండ్ లెవెల్‌లో అటువంటి నిర్వహణ జరగడంలేదు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ కొరవడి సిబ్బంది కూడా సక్రమంగా పనిచేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రానున్న వేసవి కాలానికి సంబంధించి మరింత నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సిన పంచాయతీ అధికారులు ముందుగానే సమస్య ప్రాంతాలను గుర్తించి తగు పరిష్కారం మార్గాలు చేయాల్సిందిగా సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకపోయి, మురికి కాల్వలు సకాలంలో శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లక పోవడంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయడంలేదంటున్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగక రాత్రివేళ చీకట్లో ప్రజలు వీధుల్లో నడిచేప్పుడు ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక, విషపురుగులేమైనా సంచరిస్తున్నాయో తెలియక భయంభయంగా వెళ్లాల్సి వస్తోందంటున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో సమయానుకూలంగా కార్యదర్శి లేక కార్యాలయం తెరువకపోవడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నూతన ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. వివిధ పనులపై గ్రామపంచాయతీకి వచ్చిన ప్రజలకు కార్యాలయంలో సంబంధిత కార్యదర్శి లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలి :

సయ్యద్ ఆసీఫ్, స్థానికుడు



ప్రస్తుతం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో పాలన వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ పరిధిలోనీ పలు వీధుల్లో మురుగు కాలువల నిర్వహణ, పారిశుధ్యం, వీధి దీపాలు సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి.





నాలుగో రోజుకు చేరిన హమాలీల సమ్మె

- మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపిన హమాలీలు
- మద్దతు తెలిపిన సీఐటీయూ, బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. శనివారం కార్మికులు మోకాళ్లపై నిల్చోని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని, ఏరియర్స్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, రూ. 10 లక్షల భీమా, హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె శిబిరంలో కార్మికులు సత్యనారాయణ, కిషన్, అంజి, సురేష్ పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన సీఐటీయూ, బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు

కాగజ్‌నగర్‌లో కొనసాగుతున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె



శిబిరాన్ని శనివారం సీఐటీయూ, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయి, జీసీసీ హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతి నూతన రేట్ల ఒప్పందం అమలు, బకాయి వేతనాల చెల్లింపు కోసం గత కొన్ని రోజులుగా సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. పైగా సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు పన్నడం సిగ్గుచేటని అన్నారు. ఈ నెల ఆరో తేదీన జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేసి, వినతిపత్రాలు ఇవ్వాలని, హమాలీ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చినందున పెద్ద సంఖ్యలో హమాలీలు పాల్గొనాలని ఆయన కోరారు. అదేవిధంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా కన్వీనర్ అంబాల ఓదేలు మాట్లాడుతూ హమాలీ కార్మికుల రేట్లు పెంచుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2024, అక్టోబర్‌లో చేసిన ఒప్పందాన్ని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. 2024, జనవరి నుండి పెరిగిన రేట్లను అమలు చేయాలని, హమాలీ కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ అనుబంధ సిర్పూరు పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాగులయ్య ఉన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆసిఫాబాద్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజా సమస్యలను వెలికితీయడంతో పాటు సమాజాన్ని సరైన దారిలో నడిపించేలా చూడాలన్నారు. రాజ్యాంగం కల్పించిన గౌరవాన్ని పత్రికలు నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, గొల్ల, నవ తెలంగాణ రిపోర్టర్ మహేష్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : నవతెలంగాణ క్యాలెండర్లను ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నవతెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుందన్నారు. ప్రజల్లో చెరగని ముద్రల నవతెలంగాణ నిలిచిందని కొనియాడారు. క్యాలెండర్ రూపకల్పనలో మంచి నాణ్యతను పాటించి ప్రజల మన్నన పొందుతుందన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొడితే రవి, కాంగ్రెస్ నాయకులు జావిద్ హుస్సేన్, శ్రీనివాస్, సంజీవ్, తులసిరామ్ పాల్గొన్నారు.

వాంకిడి : మండ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రియాజొద్దీన్ నవతెలంగాణ 2025 నూతన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ స్రావన్, ఎస్ఐ ప్రశాంత్ పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో సీఐ సత్యనారాయణ నవతెలంగాణ 2025 నూతన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు.



బెజ్జూర్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై, ప్రజాప్రతినిధులు

వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పదో తరగతి పరీక్షలలో వంద శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి సూచించారు. శనివారం ఆయన కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యతను, రిజిష్టర్‌లను పరిశీలించారు. పదో తరగతి గదిలోకి వెళ్లి గణితంలో పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల పఠనాసామర్థ్యాలను పరిశీలించారు. గణితంలో అత్యధిక మార్కులు వచ్చేందుకు అనుసరించాల్సిన సులభ పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేపడుతున్నామని అన్నారు. గడువులోగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవీఐ రాజమల్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎంవీఐ మోహన్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అరుణబాయి, సిబ్బంది వినీల్, వాజిద్ పాల్గొన్నారు.

సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం (టీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు సాంఘీక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలకు వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వీరికి కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయులు డాక్టర్ శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, టీఎస్ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి రవి శంకర్, ప్రధాన కార్యదర్శి జై లాలాజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవితో పాటు వివిధ మండలాల సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు హిందీలో పీహెచ్‌డీ పట్టా తీసుకున్న ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయం అన్నారు. చదువు గొప్పతనాన్ని చాటిన సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆమె గొప్పతనాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎంఈఓ సుభాష్, ఉపాధ్యాయులు హేమంత్ షిండే పాల్గొన్నారు.

మరణించిన మేకలకు నష్టపరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్



రేస్ కుక్కల దాడిలో చనిపోయిన మేకలకు నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కావేరి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లికి సంబంధించిన ముల్కాల రాజుకు చెందిన మేకలు మేతకు వెళ్లిన సమయంలో రేస్ కుక్కలు వేటాడి 50 మేకలను చంపాయని, వీళ్లకు ఫారెస్ట్ అధికారులు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. బాధితులకు రూ.10 లక్షలకు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో బీసీ కుల సంఘాలన్నింటిని కలుపుకొని ఫారెస్ట్ రేంజ్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు తాండ్ర అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు

నవతెలంగాణ-లక్సెట్టిపేట



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలుండాలని తహసీల్దార్ ఏ.దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం నవ తెలంగాణ తెలుగు దినపత్రిక 2025 నూతన క్యాలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసి తహసిల్దార్ చేతుల మీదుగా క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమష్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ బూడిదలో అరుదైన ఖనిజాలు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నుండి వెలువడుతున్న బూడిదలో అరుదైన ఖనిజాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయమై ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్-ఆస్ట్రేలియా కీలక ఖనిజాల పరిశోధన సదస్సులో సీఎండీ బలరామ్ నాయక్ వెల్లడించారు. కీలక ఖనిజాల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సులో ఆయన చేసిన ప్రారంభోపన్యాసంలో సభా ముఖంగా పేర్కొన్నారు. ఎస్టీపీపీ బూడిదలో విలువైన ఖనిజాలు ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. ఎస్టీపీపీ బూడిదలో 500 పీపీఎంల పరిమానంలో అరుదైన ఖనిజాలు ఉన్నట్టు అధ్యయనాల్లో ద్వార తెల్సిందన్నారు. కాగా వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే అంశాలపై సమగ్ర అధ్యయనం చేయించనున్నట్టు వివరించారు. స్వచ్ఛ ఇందన రంగంలో సింగరేణిని అగ్రస్థానంలో నలిపడమే లక్ష్యమన్నారు.

ఆదివాసులపై దాడులు సరికాదు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గురువాపూర్‌లో ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను అక్రమంగా దొంగ పట్టాలు చేసుకొని దాడులు చేస్తున్నారని గురువాపూర్ ఆదివాసీ గిరిజనులు కుర్సింగ మోహన్, ఆత్రం మహదు, ఆడే నగేష్, కుర్సింగ కేశవరావు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ముత్యంపల్లిలోని గురువాపూర్ 74/1, 74/2 సర్వే నెంబర్‌లో గల భూములను ఇనిగంటి సత్యనారాయణ, వీర్ల సుధాకర్ అనే వ్యక్తులు వేరువేరుగా అదే భూమిలో అక్రమంగా దొంగ పట్టాలు చేసుకున్నారన్నారు. ఆదివాసీ గురుజనులు 1920 నుంచి సాగు చేసుకుంటున్నామని, 1955 నుంచి కాస్తులో ఉన్నామని, ఇప్పటికీ మా భూములను తామే సాగు చేసుకుంటున్నామని తెలిపారు. 2016లో ఇనిగంటి సత్యనారాయణ అక్రమంగా పట్టా చేసుకొని వచ్చి భూమిలివ్వాలని తమాపై దాడులు చేయించి తిరిగి మళ్ళీ తమాపైనే కేసులు పెట్టారన్నారు. ఇదే భూమిలో 2020లో మరొకరు వీర్ల సుధాకర్ అనే వ్యక్తి కూడా పట్టా ఉందని రౌడీలను తీసుకువచ్చి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దశబ్దాల నుంచి కాసులో, సాగులో ఉన్న అమాయక గిరిజనుల భూములను అక్రమంగా పట్టా చేసుకొని లాక్కోవలని చూస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేసి పట్టాలు రద్దు చేయాలని కోరారు. వీరికి రైతు బంధు, ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలన్నారు. అర్హులైన ఆదివాసీ గిరిజనులకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా లక్ష్మినారాయణ

- నేడు మార్కెట్ కమిటీ యార్డులో ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-జన్నారం



జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యావర్గాన్ని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. చైర్మెన్‌గా జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మి నారాయణ, వైస్ చైర్మెన్‌గా జన్నారం మండల పొన్కల్‌కు చెందిన సయ్యద్ ఫసిఉల్లనీ నియమించారు. అలాగే సభ్యులుగా ఎల్ల లావణ్య, లకవత్ తిరుపతి, పూసం సోనేరావ్, పులిశెట్టి లావణ్య, అంబడిపల్లి నర్సయ్య, రేగుంట ప్రదీప్, ముత్యం రాజన్న, బెడద సత్తయ్య, గర్వదుల సత్యగౌడ్, బెనవేని రాజన్నలను నియమిస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారితో పాటు పొన్కల్ ప్యాక్ చైర్మెన్, మంచిర్యాల జిల్లా మార్కెటింగ్ అధికారి, మంచిర్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జన్నారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సభ్యులుగా ఉంటారని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నేడు మార్కెట్ యార్డ్‌లో ప్రమాణ స్వీకారం

నూతనంగా నియమింపబడ్డ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం జరిగే ప్రమాణ స్వీకరోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గని మేనేజర్ కు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట2 ఇంక్లైన్ గనిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గని మేనేజర్ గొడిశెల లక్ష్మీనారాయణకు సన్మానం చేశారు. టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి ఆధ్వర్యంలో గని మేనేజర్ లక్ష్మీ నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఓర్మెన్ కొత్తపల్లి కృష్ణాచారి, దొమ్మేటి గోపాలకృష్ణ, మస్కా రమేష్, మనిబాబు, పోశం, యాదగిరి, ఇందురి శ్రీను, కుమార్, కొముర్‌రెల్లి, నరసింహ, దామోదర్, నాయకులు పాల్గొన్నారు.



రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి
- ప్రజాభిప్రాయం మేరకు డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సీఎస్ఆర్ నిధులతో మండల పరిధిలో రూ. 73 లక్షలతో 15 పనులు వివిధ గ్రామాలలో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మండల పరిధి కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం ఇందారంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ నిర్మాణపు పనులు ప్రారంభించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా గుత్తెదారుడికి సూచించారు. గ్రామీణుల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులు 90 శాతం పూర్తి కావస్తున్నట్టు తెలిపారు. గ్రామీణుల అభిరుచి మేరకు మొదటి ప్రాధాన్యతగా డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించనున్నామన్నారు. ప్రజాభిప్రాయంతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అదేవిధంగా తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు బోరు బావులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందారం గ్రామ పంచాయతీ దొరగారిపల్లిలో రూ.4 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ. 4 లక్షలతో సీసీ రోడ్డు పనులకు పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో వెంకట్రావుపల్లిలో నిర్మించనున్న జీపీ భవన నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముదిగుంట గ్రామంలో రూ. 20 లక్షలతో 4 సీసీ రోడ్లు, రూ. 5లక్షలతో డ్రేనేజీ నిర్మాణపు పనులు ప్రారంభించారు. దుబ్బపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, మిట్టపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, గంగిపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, కిష్టాపూర్‌లో రూ.5 లక్షలతో డ్రేనేజీ రూ.10 లక్షలతో 2 సీసీ రోడ్లు, శివ్వారంలో రూ. 10 లక్షలతో 2 సీసీ రోడ్లు నిర్మించనున్నారు.

భీమారంలో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్

భీమారం మండల కేంద్రంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పర్యటించారు. మండల కేంద్రంలో గల పద్మశాలివాడలో సీసీ రోడ్డు నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో రూ.10 లక్షలతో 2 సీసీ రోడ్లు, మద్దికల్‌లో రూ.15 లక్షలతో 3 సీసీ రోడ్లు, ఎల్కేశ్వరంలో రూ.10 లక్షలతో 2 సీసీ రోడ్లు, కొత్తపల్లిలో రూ.5 లక్షలతో 3 సీసీ రోడ్లు నిర్మించనున్నారు. మండలంలో మొత్తంగా 10 పనులు రూ. 40 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మాణపు పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మంచిర్యాలను అభివద్ధి చేస్తా

- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంచిర్యాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతానని, కార్పొరేషన్‌గా మారితే అభివృద్ధిలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ని లుపుతానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం గోదావరి రోడ్‌లో నిర్మిస్తున్న వైకుంఠధామం, మార్కెట్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానన్నారు. మూడేండ్లలోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి చూపిస్తానన్నారు. వైకుంఠధామం నిర్మాణ పనులు జరుగుతున్నాయని, శివరాత్రి పండుగలోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 650 పడకల హాస్పిటల్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరులోగ రాళ్ళవాగు ఇరువైపులా కరకట్ట నిర్మాణం పనులు ప్రారంభిస్తామని, మెయిన్ రోడ్, కూరగాయల మార్కెట్, శ్రీనివాస్ టాకీస్ రోడ్ రహదారి విస్తరణ పనులు ఆరునెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వ్యాపారస్థులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైన్ పనులు పైలట్ ప్రాజెక్టు కింద చేపడుతున్నామన్నారు. ఆరు నెలల అనంతరం వ్యాపార కూడళ్ల రూపు రేఖలు సుందరంగా మారుతాయని సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మెన్ సల్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాసంగి పంట తర్వాత చిన్న తూము ఏర్పాటు




నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కడెం ప్రధాన కాలువ 22వ డిస్ట్రిబ్యూటరీ వద్ద సింగరాయపేట నీరు వెళ్లడానికి అక్రమంగా పెద్ద తూము పెట్టారని, దాంతో రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాల రైతుల పంటలకు కడెం ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు అందడం లేదని, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ గత సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఈఈ విఠల్‌కు తూమును పరిశీలించి ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. దీంతో ఆయన శనివారం కడెం ప్రధాన కాలువ 22వ డిస్ట్రిబ్యూటర్‌కి సంబంధించిన తూమును పరిశీలించారు. దానికి సంబంధించిన ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ యాసంగి పంట కలం పూర్తి అయిన తర్వాత అక్కడ ఉన్న పెద్ద తూమును తీసివేసి పూర్తిస్థాయిలో శాశ్వతంగా చిన్న తుమ్మును బిగిస్తామన్నారు. అప్పటివరకు సింగరాయపేట చెరువులోకి ఎక్కువ నీరుపోకుండా తాత్కాలికంగా పనులను చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, జునుగురి మల్లయ్య, డాక్టర్ సురక్షణ్, ఆకుల రామయ్య, ఆకుల రాజన్న, డీఈజేఈ సూపరింటెండెంట్ మామిడి శంకర్, రైతులు పాల్గొన్నారు.

పదిలో జిల్లాను ముందు స్థానంలో నిలపాలి

- జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.యాదయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

మార్చిలో జరిగే 2024-25 పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితల్లో జిల్లాను రాష్ట్రంలో ముందు స్థానంలో నిలపడానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ జిల్లాకు వంద శాతం ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్ష విధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలనీ, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ నిర్దిష్టమైన విధివిధానాలతో ప్రతివారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి పరీక్షలలో పాస్ అయ్యే విధంగా, ఎక్కువ మంది విద్యార్థులు వంద శాతం మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అపార్ కార్డులు, పదవ తరగతి పరీక్షల కార్యాచరణ, రెండు పూటలా ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల గ్రాంట్ల వినియోగం, మొదలైన అంశాలపై చర్చించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తు ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అమలయ్యే విధంగా చూడాలన్నారు. వీటిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగపు అదనపు కమిషనర్ దామోదర్ రావు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోదర, శ్రీనివాస్, రాజ్ కుమార్, సత్యనారాయణ మూర్తి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్



ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువల పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన గడికొప్పుల రాజేష్ (32) సింగరేణి కార్మికుడు బెల్లంపల్లికి వెళ్ళి తిరిగి స్వగ్రామానికి వస్తుంన్నాడు. నస్పూర్ ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. తండ్రి ఈసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెరిగిన హమాలీ రేట్ల జీఓను విడుదల చేయాలి



నవతెలంగాణ-తాండూర్

గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన హమాలీ కూలీ రేట్లు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శనివారం ఎమ్మెల్సీ పాయింట్ వద్ద హమాలీ కార్మికుల ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి హమాలీ రేట్లు పెంచుటకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. జీఓ విడుదల చేసి ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేస్తూ ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ చిత్తశుద్ధితో హమాలీ కార్మికుల శ్రమను గుర్తించి హమాలీ రేట్లు పెంచటం జరుగుతుందన్నారు. గత ఒప్పందం ప్రకారం జనవరి 1 నుండి కొత్త రేట్ల ఒప్పందం జరగాల్సిఉందని తెలిపారు. చర్చలు జరిపి పరిష్కరించాలని కోరారు.

శివాజీ విగ్రహ ప్రతిష్టకు సహకరించాలి

నవతెలంగాణ-జైపూర్



మండల కేంద్రంలో శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టకు సహకరించాలని శివాజీ సేన నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ సహకరించాలని కోరుతూ ఎంపీడీఓ సత్యనారాయణకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ సేన నాయకులు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తే ఆయన స్ఫూర్తి అందరికి తెలుస్తుందన్నారు. వీరితో పాటు బీజేవైఎమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేతం శివకృష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షులు పల్లికొండ వెంకటేష్, బీజేపీ జిల్లా నాయకులు చేగొండ శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ నాయకులు రామగిరి రాము మాదిగ, ఆంబేద్కర్ యువజన సేవా సమితి నాయకులు ఎనగందుల రవితేజ ఉన్నారు.

వివేకానంద పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలైన ఆహార పదార్థాలను తయారు చేసుకొని వచ్చారు. ఆహార పదార్థాలు ఎలా తయారు చేశారు. వాటి ద్వారా ఉపయోగాలు తెలియజేశారు. విద్యార్థులకు ఆహార పదార్థాల ద్వారా కలిగే ప్రోటీన్లు కార్బోహైడ్రేట్లు ఎన్ని పదార్థాలు తదితర అంశాలు తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.

సెపక్ తక్రా పోటీలకు విద్యాభారతి విద్యార్థి

నవతెలంగాణ-తాండూర్

ఈనెల 10 నుంచి 14 వరకు జరగనున్న జాతీయస్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని విద్యా భారతి పాఠశాల విద్యార్థిని కే.స్ఫూర్తి కారుణ్య ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థిని అభినందించి రూ.5000 నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి తల్లితండ్రులు, ప్రిన్సిపాల్ సరోజిని, వ్యాయమ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.



కొనసాగుతున్న హమాలీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పెంచిన రేట్లకు సంబంధించి జీఓ జారీ చేయాలంటూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ హమాలీ రేట్లు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి సంబంధించి జీఓను వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసరదారులకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ అందించాలన్నారు. బోనస్ రూ. పదివేలకు పెంచాలన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా నాయకులు శ్రీనివాస్, తుకారం, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నూతన సంవత్సర సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి నాయకులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. నూతన సంవత్సరంలో జిల్లాలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేల చర్చించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ అలిబిన్ అహ్మద్ నాయకులు నిసార్, హైమద్, శంకర్ పాల్గొన్నారు.

మానవహారంతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ గత నెల పదో తేదీన ప్రారంభమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన 26వ రోజు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మానవహారం ఏర్పాటు చేసి ఎస్ఎస్ఏ అనే పదాలు వచ్చేలా కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ గతంలో పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని వెంటనే తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరారు. 20 సంవత్సరాల నుండి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా ప్రభుత్వ పథకాలు ముందుకు తీసుకుపోవడంలో సహకరిస్తున్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. 26 రోజుల నుండి సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయి విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి తుకరం, ఉపాధ్యక్షులు నాగసుధ, రమణ, జిల్లా కోశాధికారి బోయిని నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, అధికార ప్రతినిధి పవన్ కుమార్, కార్యదర్శి దుర్గం సందీప్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు నలంద, అరుణ, మీనా, కవిత పాల్గొన్నారు.

'క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి'



నవతెలంగాణ-బెజ్జూర్

క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో తాలూకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. పేకాట మత్తు పానీయాలు సేవించకూడదని ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జావిద్ హుస్సేన్, శ్రీనివాస్, తులసిరామ్, కోటేష్, తిరుపతి పాల్గొన్నారు.

లైబ్రరీ స్వీపర్ల వేతనాలు పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రంథాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్ల వేతనాలు పెంచాలని జిల్లా గ్రంథాలయ స్వీపర్ల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ రియాజ్‌ను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో గ్రంథాలయాల పరిశుభ్రతకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం చేసి వేతనాలు పెంచాలని కోరారు. 1995 నుండి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని ప్రస్తుతం రూ.6000 మాత్రమే ఉందని పెరుగుతున్న ధరలకు ఇది ఏ మాత్రం సరిపోదన్నారు. అయితే ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో తాత్కాలిక స్వీపర్లు సలీం, గోపి, అరుణ, బుచ్చన్న, రాజన్న, రామయ్య, రాజారాం, అశోక్ పాల్గొన్నారు.

11న మండల స్థాయి క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో ఈ నెల 11న ప్రారంభించనున్న వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ (వీవీ) క్రికెట్ టోర్నమెంట్ పాంప్లేంట్లను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆవిష్కరించారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన మండల కేంద్రంలో క్రికెట్ పోటీలకు సంబంధించిన విధివిధానాలను వెల్లడించారు. మండల స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మండల పరిధి క్రీడాకారులు మాత్రమే అర్హులని నిర్వాహకులు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.15 వేలు నగదు అందజేయనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు రూ.1000 చొప్పున ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎవరి వారుగా వ్యక్తిగత ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావల్సి ఉంటుందని తెలిపారు. ఒక గ్రామానికి చెందిన క్రీడాకారుడు మరో గ్రామానికి చెందిన జట్టుతో కలిసి పోటీల్లో పాల్గొనేందుకు అనర్హులుగా పేర్కొన్నారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనే వారు ఏ కారణంగా దెబ్బలు తాకితే యాజమాన్యానికి ఏమాత్రం సంబంధం లేదని హెచ్చరిస్తూ మద్యం సేవించిన వారు పోటీల్లో పాల్గొంటే వారి జట్టు మొత్తాన్ని రద్దు చేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ : 7396396369, 9014811084లలో సంప్రదించాలని సూచించారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో రహదారుల ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు దీనికోసం 45 ప్రాంతాలను ప్రమాదం జరిగే వాటిగా గుర్తించినట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ రహదారి భద్రత మాసోత్సవాలపై జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత మాసోత్సవాలను సంబంధిత అధికారుల సమన్వయంతో జిల్లాలో కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే 45 ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, మూలమలుపు, వేగనిరోధకాలు, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారుల మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రమాదాల నియంత్రణలో భాగంగా తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పట్టణ ప్రాంతాలలోని కూడళ్లలో రోడ్డు ఆక్రమణలు జరగకుండా సంబంధిత మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నెలరోజుల పాటు రోడ్డు భద్రత మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులతో ర్యాలీలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేసే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి రామ్‌చందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి సురేందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని ఆర్‌టీఓ చెక్‌పోస్టు వద్ద ఏఎంవీఐ కె.రామచందర్ నాయక్ శనివారం వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ నియమాలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటామని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

ఆరోగ్య పాఠశాలపై కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మూడోసారి సమీక్షా సమావేశాన్ని శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు వాటి వల్ల కలిగిన ప్రయోజనాలు 43 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు స్టూడెంట్ ఛాంపియన్స్ కలెక్టర్ రాజర్షిషాతో నేరుగా పంచుకున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలు ఎవరికైతే గుట్కా తంబాకు సిగరెట్ తాగడం వంటి చెడు వ్యసనాలను మానేశామని తెలియజేశారు. అంతేకాకుండా తల్లిదండ్రులలో కూడా ఇలాంటి మార్పు పిల్లలు కోరుతున్నామని తెలిపారు. మోడల్ స్కూల్ గుడిహత్నూర్‌కు చెందిన స్టూడెంట్ ఛాంపియన్-2025 ముగిసేకల్లా తండ్రితో చెడు వ్యసనాలు పూర్తిగా మానేస్తానని తెలియజేశారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ సిర్సన్న పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలను వినూత్నంగా ఆటల ద్వారా కొనసాగిస్తున్నామని వైకుంఠపాళిలో ఆరోగ్య పాఠశాల సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందుపర్చి తద్వారా పిల్లలతో ఆటలాడించి కార్యక్రమ అంశాలను అవగాహన కల్పిస్తున్నారు. జెడ్పీహెచ్ఎస్ తోషం పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానం నుంచి ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలతో సహా పాఠ్యాంశాలను కూడా బోధిస్తున్నామని తద్వారా సమయాన్ని తగ్గించడమే కాకుండా పిల్లలు ఆసక్తికరంగా నేర్చుకుంటున్నారని, పాఠశాల హెచ్‌ఎం గోపాల్ సింగ్ తిలావత్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సంతోష్ పేర్కొన్నారు. అనంతరం స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఆరోగ్య పాఠశాల అనుసంధానకర్త అజయ్ , అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రేపు జిల్లాలో పర్యటించనున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవలక్ష్మి తెలిపారు. అయితే కవిత పర్యటన వాంకిడి, జైనూర్ మండలాల్లో ఉండనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆ దిశగా సమాయత్తమవుతున్నాయి. వాంకిడి మండలం బంబారా ఆశ్రమ పాఠశాలలో చదువుతూ మృతిచెందిన శైలజ కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు ఉశేగాం దేవుగూడలోని బాధితురాలు మేస్రం నీలాబాయిని పరామర్శించనున్నట్టు తెలిసింది. జైనూర్‌లో పార్టీ శ్రేణులు కవిత పర్యటన ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏర్పాట్లను జైనూర్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు శంకర్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు మడావి భీంరావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కుంరం భగవంత్ రావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గేడాం లక్ష్మణ్, సర్పంచులు మెస్రం నాగోరావు, మెస్రం రాహుల్ పరిశీలించారు.

రెబ్బెన : గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క రానున్నట్టు టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మాల్‌రాజ్ శ్రీనివాసరావు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన



నవతెలంగాణ-తలమడుగు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి పరిశీలించారు. మండలంలోని భరంపూర్ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని, మండల అధికారులను కోరారు. గ్రామాల్లో సకాలంలో చేరుకొని, రైతులు, కూలీలు పనులకు వెళ్లకముందే వారి ఇండ్ల ముందు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ రాజమోహన్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఉన్నారు.

దొంగతనానికి పాల్పడ్డ నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రానికి చెందిన సూర్యవంశి ఉలాజి ఇంట్లో ఈనెల 2న తన పొలం పనుల కోసం తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. కాగా మధ్యాహ్నం పొలం పనులు ముగించుకుని ఇంటికి రాగా తాళం పగులగొట్టి తన జేబులో ఉన్న పది వేల రూపాయలు దొంగతనం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీసీ పుటేజి ఆధారంగా నిందితుడిని పట్టుకొని సీసీఎల్ 16 సెక్షన్‌లో అరెస్టు చేశామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ రహీమ్ పాషా అన్నారు. శనివారం మండలంలోని ఖైర్‌డాట్వా గ్రామంలో ఆంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో భాగంగా గెలుపొందిన ఆయా గ్రామాల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ మడావి నారంజి, మడావి జంగు దేవారి, యూత్ అధ్యక్షుడు మడావి జైవంత్‌రావ్, గ్రామ పెద్దలు మడావి రాము, కుమ్ర గోవింద్‌రావ్ ఉన్నారు.

పిల్లలు మంచి పఠనాసక్తిని అలవర్చుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

పిల్లలు మంచి పఠనాసక్తిని అలవర్చుకోవాలని ఎంఈఓ సునీల్, రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి విజయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా పిల్లలకు అందించిన వర్క్, స్టోరీ పుస్తకాల వల్ల పిల్లల్లో అక్షర సామర్థ్యాన్ని పెంపొందించడానికి చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. పఠనాసక్తిని పెంపొందించడానికి కూడా ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం, కాంప్లెక్స్ సెక్రటరీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఝరి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరి గ్రామానికి చెందిన గడ్డం పోతారెడ్డి(50) ఆర్థిక ఇబ్బందులతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గడ్డం పోతారెడ్డి గత కొద్ది నెలల నుంచి ఆర్థిక సమస్యలు ఎక్కువడంతో తన చేనులో పురుగుల మందుతాగగా చుట్టు పక్కలవారు గమనించి, రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మరణించాడు. భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు.

9న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఉద్యోగానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ 2023, 24లో పూర్తయిన కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఇందులో ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.05లక్షల వేతనం ఉంటుంది. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, భోజన వసతితో పాటు ప్రతి నెల స్టైఫండ్ ఉంటుంది. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎంపిక అయితే వారు డిగ్రీ పూర్తి చేసుకోవడానికి కంపెనీ నుంచి తగిన సహకారం అందించబడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జీరాక్స్ కాపీలు, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫోటోలతో ఈనెల 9న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు టాస్క్ కోఆర్డినేటర్ ముజీబ్, మెంటర్ చైతన్య, 9885762227 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అడెల్లి రోడ్డును పరిశీలించిన ఎంపీ

నవతెలంగాణ-బోథ్



అడెల్లి రోడ్డును ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. బోథ్ నుంచి సారంగాపూర్ మండలంలోని అడెల్లి పోచమ్మ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. ఎంపీ వెంట తాంసి మాజీ జెడ్పీటీసీ తాటిపెల్లి గంగాధర్, నాయకులు చంద్రకాంత్, గాదే శంకర్, రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జుగాదిరావు, నాయకులు మహిపాల్, విజయ్, నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తీర్చేందుకు కృషి

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలో లోఓల్టేజ్ సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక సబ్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరెంట్ సమస్య ఉందని, రైతులు కరెంట్ కష్టాలపై విన్నవించగా వెంటనే 5ఎమ్‌వీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం బోథ్ క్యాంపు కార్యాలయంలో పలు సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. అలాగే ఎలక్ట్రిసిటీ సీఈ జెఆర్ చవాన్‌తో మాట్లాడి పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రోకండ్ల రమేష్ మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ రోకండ్ల రమేష్ గుండె పోటుతో హఠాన్మరణం చెందడం పట్ల కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎంతో హుందాగా వ్యవహరించిన ఆయన మృతి జిల్లా రాజకీయాల్లో తీరని లోటని ఒక ప్రకటనలో ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, రమేష్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పరిశుభ్రమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-నేరడిగొండ



చిన్నారులకు పరిశుభ్రమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండలంలోని వాగ్దారి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వంటగదిని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ కవితతో మాట్లాడుతూ పిల్లలకు పరిశుభ్రమైన వంటలను చేసి పెట్టాలని సూచించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తినుబండరాలపై ఎటువంటి క్రిమి కీటకాలుగాని, ఈగలు గాని, దోమలు గాని, వాలకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్ ఆయమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం పరిశీలన

నవతెలంగాణ-బోథ్

మండలంలో నూతనంగా ఏర్పాటు అయిన సొనాల మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలను శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. అలాగే అన్ని కార్యాలయాలకు భవనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఉప తహసీల్దార్ మల్లేష్, ఎంపీఓ అతుల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-బోథ్



మండలంలోని పొచ్చెర సెంట్ థామస్ పాఠశాలలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల రోడ్డు ప్రమాదాలను నివారించుటకు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. అవగాహన చేసుకున్న ప్రతి విషయాన్ని తమ తల్లిదండ్రులతో ఇతర వాహనాలను నడిపే పెద్దవారితో పాలు పంచుకొని యాక్సిడెంట్లు నివారణకు తమ వంతు ప్రయత్నం చేయాలని సూచించారు. సదస్సు నిర్వహణలో సహకరించిన పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఆర్టీసీ సిబ్బంది రాజన్న, జి.రాజేశ్వర్ రెడ్డి, జి.సాయన్న పాల్గొన్నారు.